కళ్లలోకి చూస్తూ.

"ఏ ముసలివాడు?" అంది భారతి అప్పుడే ఉత్తరం సంగతి పూర్తిగా మరచిపోయినట్టు.

"ఇతడు" అని అగ్నిలో యింకా తన స్వరూపాన్ని పూర్తిగా పోగొట్టుకోని ఉత్తరం వైపు చూపించాడు రఘు.

"నా ముసలివాడు మీరే-మీ ముసలిదాన్ని నేనే-లేవండి" అని రఘు భుజం పట్టుకొని వూపింది భారతి.

"నా ముసలిది ఆమె" అని టేబిలుపైన ఫ్రేములోవున్న భారతి ఫోటోవైపు చూపించాడు రఘు.

వర్ధమాన జాతీయ సంస్థ

# చీకటి బజారుకి జేజేలు

నీ నా

"ఓ సుందరీ!"

"ఏమండీ?"

"పలుకరాదటే చిలుకా. పలుకరాదటే— ఓ, చిలుకా పలుకరాదటే?"

"ఒక్కమాటు పెద్ద గాయకశిఖామణులై పోయినట్లుందే? ఏమిటి సెలవు?"

"'లలనా నీమోము చూడనే పుట్టు కవిత్వము, కపిత్వము, పైత్యము పరవశత్వమునన్' అన్నాడు మహాకవి."

"సరేలెండి ఠరిగ్గా కూచున్నారు కాని నాకు తీరికలేదు మీ పైత్యాలన్నీ వినడానికి. ఎందుకు పిలిచారో చెప్పండి."

"ఇవాళ ఉగాది పండుగ ఏంచేస్తావ్?"

"శనివారం చేయదల్చుకున్నాను."

"భేష్!... నీవు కూడా శ్లేష ప్రయోగిస్తున్నావే?"

"కవిగారి భార్యామణికి ఆమాత్రమైనా కవిత్వం రాకపోతే ఎలా చెప్పండి."

"సరే నీవుద్దేశం చెప్పావు కావు?"

"చెప్పానుగా శనివారమని! అదికాకపోతే ఏకాదశి."

"అరెరె. ఖరనామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమీ దినాన్ని పట్టుకుని ఏకాదశి అంటావేం?"

"మరేం చేయమన్నారు?"

"ఏం ఇంటో ఏమీ లేదా?"

"ఏముంది ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. నాకు పండగపూట పొయిమీదికి గిన్నె కెక్కించే అవసర తప్పింది. హాయిగా నేనూ కుర్చీలో కూర్చొని పాటలు, పద్యాలు రాయొచ్చు."

"ఏం సంవత్సరాదినాడు మొగుణ్ణి సాధిస్తే సంవత్సరం పొడుగునా సాధించవచ్చుననా నీ వుద్దేశం. పండగపూటా శనివారాలు, ఏకాదశులు వుండమంటే ఎలా?"

"ప్రజారాజ్యంలో ఖరశీర్షముల పరిపాలనలో సంవత్సరానికి ఆదేమిటి, అంత మేమిటి, ఏకాదశేమిటి,శనివార మేమిటి అంతా ఒకటే."

"చచ్చామన్నమాటే? ఏది దారి?"

"మీయిష్టం. ఇంట్లో బియ్యంలేవు. మీకేది తోస్తే అది చెయ్యొచ్చు. నిన్నటికే బొటాబొటీగా వచ్చాయి వారమల్లా సర్దితే. ఇవాళ పస్తే."

"పండుగనాడూనా అని"

"మనకి పండగేమిటి, మంత్రులకు, లెజిస్లేచర్ మెంబర్లకు, పర్మిట్ల మోతుబర్లకు కాని! మనకు ప్రతివారం పండుగే, ప్రతి శనివారం ఏకాదశే!"

"ఆదివారం పండుగెలా అయింది?"

"మీరు పొద్దున ఏడుగంటలకు రేషన్ షాపుకుపోయి పదకొండు గంటలకు బియ్యం తీసుకువస్తే వండి రెండుగంటలకల్లా పెడతాను కదా! మరి పండగనాడూకూడా భోజనాలు ఆలస్యం కావూ? అంచేత భోజనం ఆలస్యం ఐన రోజునే మనకి పండగ."

"నిన్నో పార్లమెంటు మెంబరుగా చేస్తే యిలాగే ఏకి పారేసావు కాబోలు మంత్రు

అందర్నీ."

"అబ్బే! మీకు గాజులు తొడిగి కూర్చో పెట్టి బస్సురూట్లు సంపాదిస్తాను."

"అయితే నావోటు నీ కివ్వను."

"ఇలా మాట్లాడుతూ కూర్చుంటే సాకు పని కాదు. మీకేం! ఆఫీసు లేదుగా"

"ఏంచేద్దాం చెప్పు. కింకర్తవ్యతా మూఢుడనై శ్రవణ కుహరమంతా కేంద్రీకరించి రాణీగారి ఆజ్ఞలకై ఎదురు చూస్తున్నాను."

"హోటలునుండి భోజనం తెప్పించండి."

"అమ్మ నాయినో!"

"లేకపోతే బజారుకుపోయి బియ్యం పట్రమ్మంటాను."

"ఇదేం విక్టోరియా మహారాణీ కాలమనుకున్నావా యిష్టం వచ్చినప్పుడల్లా బజారుకుపోయి ఏవిపడితే అవి తెచ్చి పడేసుకుందుకు? ఆదివారమే రేషన్ తెచ్చుకున్నాంగా యింక బియ్యం ఎక్కడ తెచ్చేది?"

"చెట్టిగారి నడగండి"

"బ్లాక్ మార్కెట్టా?"

"కాదు పబ్లిక్ ప్రైవేటుమార్కెట్. పోలీస్ స్టేషన్ ఎదురుగావున్న మార్కెట్టును బ్లాక్ మార్కెట్టని అవమానం చేస్తారేమండీ మీరు?"

"సరే ఒకపడి చాలునా?"

"ఇవాళటి మొర్ర తీరుతుంది."

* * *

"గుడ్ మార్నింగ్ చెట్టిగారూ!"

"గుడ్ మార్నింగ్. ఏం ఇవాళ యిలా దయచేసేరు పంతులుగారు. కులాసాగా వున్నారా?"

"ఆఁ! ఏదో అలా బజారుకు పోతూ వచ్చేను."

"ఏమిటి విశేషాలు?"

"ఏమున్నాయి. మనం యిలా వున్నాం. ప్రపంచం జరిగి పోతోంది."

"ప్రపంచం జరక్కేంచేస్తుంది మీ పిచ్చి గాని! మనం మాత్రం ఇలా వుండిపోతామా? ఏది శాశ్వతం."

"సరేగాని ఒక్క పడి బియ్యం యిప్పించాలి మీరు"

"అరెరె. ఇందాకనే అయిదు పళ్లే ఉంటే యిచ్చేశానయ్యా. మరి లేవు."

"పరవాలేదు చూడండి"

"బలవంత పెట్టకు పంతులూ"

"లేదు. ఇవాళ సంవత్సరాది. యింట్లో ఒక్కగింజయినా లేదు. మీరి స్తేగాని పొయిలో పిల్లి లేవదు. ఇవాళ లేదనకూడదు మీరు."

"ఏదీ యిలా యివ్వండి"

"ఇదిగో"

"పడి చాలునా? రూపాయి పన్నెండణాలు."

"చాలు... ఏం పళ్లీ రెండణాలు ఎక్కువైందాండి?"

"సెంట్రలు గవర్నమెంటు టాక్సు పెంచేసేరు కాదండీ మరి."

* * *

"ఇదిగో... ఇంద, త్వరగా వంటయితే ఆఫీసుకు పోవాలి."

"అదేమిటి ఇవాళ గవర్నమెంటువారి సెలవు కాదూ?"

"గవర్నమెంటువారి సెలవు కాని గవర్నమెంటు వారికి సెలవుకాదులే. ఆఫీసర్లు రాకపోయినా ఆఫీసు వర్కు జరగాలి."

"అయితే లైటైపోయిందే ఎప్పుడు భోంచేస్తారు ఎప్పుడు వెళతారు?"

"పన్నెండు గంటలకు వెళితే చాలులే."

"ఇదెంత?"

"పడి పన్నెండణాలు."

"ఇంతేనే! అయితే యింకో రెండు పళ్లు తీసుకురాలేక పోయారా?"

"నీ అమాయకత్వం పోగొట్టుకున్నావు కావు. పన్నెండణాలంటే బ్లాక్ మార్కెట్ ధర రూపాయి పోగా కంట్రోలు ధర పన్నెండణాలు."

"అమ్మో! ఇదివరకు రూపాయి పదణాలకే ఇచ్చేవారు?"

"ఇది ఉగాది గ్రాండ్ రిడక్షన్. చెట్టిగారు పన్ను వేశారు."

"అయ్యో రామా! సరేలెండి పండుగ పూట పస్తులేకుండా రక్షించేడు."

బ్లాక్ మార్కెట్ వర్ధిల్లాలి! అని చెట్టిగారిని దీవించి వంట కుపక్రమించింది ఆంధ్ర మహిళ.